# నాటు సారా తయారీని అరికట్టాలి



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 11**

ప్రకాశం జిల్లా జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ అధికారి గిద్దలూరు ప్రొహిబిషన్ - ఎక్సైజ్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌కు సంబంధించిన పలు రికార్డులను పరిశీలించి తనిఖీ నిర్వహించారు. తదనంతరం స్టేషన్ పరిధిలో ఉన్న మద్యం దుకాణాల లైసెన్సుదారులతో సమావేశమై అమ్మకాలు, ప్రభుత్వ ఆదాయం పెంపు అంశాలపై చర్చించారు. మద్యం విక్రయాలు నిబంధనలకు అనుగుణంగా జరగాలని, అక్రమ రవాణా , అనధికారిక విక్రయాలను పూర్తిగా నిరోధించాలని సూచించారు. అలాగే స్థానిక స్టేషన్ అధికారులకు , సిబ్బందికి పలు సూచనలు చేస్తూ నాటుసారా తయారీ, విక్రయాలు , పొరుగు రాష్ట్రాల నుండి అక్రమంగా వచ్చే మద్యం నిర్మూలనకు ప్రత్యేక దృష్టి పెట్టి కృషి చేయాలని ఆదేశించారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# పెరిగిన గ్యాస్ ధరలు

**సరఫరాలో కొత్త నిబంధనలు**

**వినియోగదారులపై అదనపు భారం**

**వంట గ్యాస్ ధర రూ.60 పెంపు**

**కమర్షియల్ సిలిండర్ పై రూ. 144**

**వాణిజ్య సిలిండర్ల సరఫరా పైన ఆంక్షలు**

**చిరు వ్యాపారులకు వంటగ్యాస్ కష్టాలు**



**కందుకూరు పెన్ పవర్ మార్చి 11:**

యుద్ధం సామాన్య, మధ్య తరగతి ప్రజలను ఆర్థికంగా ఆందోళనకు గురి చేస్తోంది. బంగారం, వెండి ఇపుడు గ్యాస్ ధరపై ప్రభావం చూపిస్తోంది.వంట గ్యాస్ ధరలను పెంచిన ఆయిల్ కంపెనీలు.. ఇప్పుడు మరో కీలక నిర్ణయం తీసుకున్నాయి. వంట గ్యాస్ బుకింగ్ తో పాటుగా సరఫరా విషయంలోనూ కొత్త నిబంధనలు అమలు చేస్తున్నాయి. ఈ తాజా నిబంధనలతో వినియోగదారుల్లో కొత్త ఆందోళన మొదలైంది. వంట గ్యాస్ సరఫరా పరోక్షంగా ధరల పైనా ప్రభావం చూపుతోంది. దీంతో రానున్న రోజుల్లో ఈ సమస్య ఎటు టర్న్ తీసుకుంటుందో అనే ఆందోళన మొదలైంది. యుద్ధం కారణంగా ఆయిల్ కంపెనీలు వంట గ్యాస్ ధరలను పెంచాయి.

ఇళ్లలో వినియోగించే వంట గ్యాస్ సిలిండర్ పైన రూ.60, వాణిజ్య సిలిండర్ పైన రూ.144 పెంచుతూ నిర్ణయం తీసుకున్నాయి. రూ.60 ధర పెంచడం వల్ల 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ రూ.960 కు చేరింది. ఇప్పటి వరకు రూ.900 ఉన్న ధరను ఒకేసారి రూ.60 పెంచడంతో వినియోగ దారులు గగ్గోలు పెడుతున్నారు. ఇరాన్ యుద్ధం ఇంకా కొన్ని రోజుల పాటు కొనసాగే అవకాశం ఉండడంతో పెట్రో, డీజిల్ ధరలు పెరుగుతాయనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. రాష్ట్రంలో ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలులో ఉన్నా నాలుగు నెలల కొకసారి మాత్రమే ఒక గ్యాస్ సిలిండర్ చొప్పున ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ప్రభుత్వం అందిస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్యాస్ సిలిండర్ ధరలు పెరగలేదు. 2023, మార్చిలో గ్యాస్ సిలిండర్ ధరలు పెంచిన కేంద్ర ప్రభుత్వం 2024 ఏప్రిల్లో ధరలను తగ్గించింది. అప్పటి నుంచి ధరలు పెరిగిన దాఖలాలు లేవు. ఇప్పుడు పెరిగిన ధరలతో జిల్లా ప్రజలపై నెలకు ఏకంగా రూ.8 కోట్లకుపైగా భారం పడనుంది.

**వాణిజ్యానికి ఆంక్షలు.....**

కాగా, ఇదే సమయంలో వంట గ్యాస్ కొరత నేపథ్యంలో వాణిజ్య సిలిండర్ల సరఫరా పైన ఆంక్షలు కొనసాగుతున్నాయి. దీంతో.. చిరు వ్యాపారులకు వంటగ్యాస్ కష్టాలు మొదలు అయ్యాయి. గృహ వినియోగ సిలిండర్లు మాత్రమే సరఫరా చేయాలని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ ఇంధన సంస్థలకు సూచించిన నేపథ్యంలో వాణిజ్య వినియోగ గ్యాస్ సిలిండర్ల సరఫరా దాదాపు నిలిచింది. నిత్యావసర వస్తువుల చట్టం కింద కేంద్రం ఈ ఆదేశాలు ఇవ్వడంతో రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో చిరు వ్యాపారులు, హోటళ్లకు సిలిండర్ల సరఫరా నిలిచింది. ప్రస్తుతం గృహ వినియోగ సిలిండర్ల బుకింగ్ మాత్రమేకొనసాగుతోందని డీలర్లు సమాధానం ఇస్తున్నారు.

**వినియోగదారులపై ఆర్థిక భారం...**

జిల్లాలో గ్యాస్ కనెక్షన్లను పరిశీలిస్తే మొత్తం సుమారు 7,62,825 గృహవినియోగదారుల గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిపై నెలకు రూ.60 చొప్పున అదనపు ధర లెక్కిస్తే.. రూ.5 కోట్లకుపైగా భారం పడనుంది. కొత్త ధరలతో సామాన్యులు మాత్రం విలవిలలాడి పోతున్నారు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే దీపం పథకం 2.0 కింద ఏడాదికి మూడు సిలిండర్ల డబ్బులను వారి వినియోగదారుల ఖాతాల్లో వేస్తోంది. ఈ విషయం కాస్త ఊరటనిస్తోంది. హోటళ్లు, రెస్టారెంట్లు.. వ్యాపార సంస్థలు.. వినియోగించే కమర్షియల్ గ్యాస్ సిలెండర్ ధరపై రూ.144 పెంచారు. జిల్లాలో సుమారుగా 2లక్షలకు పైగా వాణిజ్య గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ఈ లెక్కన జిల్లాలో వ్యాపారులపై నెలకు రూ.3 కోట్లకుపైగా భారం పడనుంది. కమర్షియల్ గ్యాస్ సిలెండర్లపై గత పదకొండు నెలలో ఏడుసార్లు కాస్త అటు ఇటుగా ధరలు తగ్గించారు. ఇప్పుడు ఆ లోటును రెట్టింపు చేసేలా ధరలు అమాంతం పెంచేశారని హోటళ్ల నిర్వాహకులు, చిరువ్యాపారులు వాపోతున్నారు.

**కొరత రాకుండా చర్యలు....**

వంట గ్యాస్ కొరత రాకుండా కేంద్రం చర్యలు చేపట్టింది. ఆయిల్ కంపెనీలకు వంట గ్యాస్ విక్రయించాలని స్పష్టం చేసింది. వంట గ్యాస్ గృహ వినియోగదారులకు మాత్రమే చేరేలా చూడాలని సూచించింది. దీంతో.. పెట్రోకెమికల్, ఇతర అనుబంధ ఉత్పత్తుల తయారీకి మళ్లించకూడదని స్పష్టం చేస్తూ ఉత్తర్వుల్ని ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇంధన కంపెనీల్లో వాణిజ్య సిలిండర్ల ఫిల్లింగ్ ను నిలిపివేయగా గ్యాస్ ఏజెన్సీల పరిధిలో సరఫరాలో కొరత కనిపిస్తోంది. ఇదే సమయంలో వంట గ్యాస్ బుకింగ్ విధానంలోనూ మార్పులు తెచ్చారు. సింగిల్ సిలిండర్ ఉన్న వారు 21 రోజులు, డబుల్ సిలిండర్ ఉన్న వారు 30 రోజులకు గ్యాస్ తీసుకున్న తరువాత తిరిగి బుకింగ్ కోసం గడువుగా నిర్ణయించారు. ఈ మేరకు ఆయిల్ కంపెనీలు.. యాప్స్ తో పాటుగా పోర్టల్స్ లో సాఫ్ట్ వేర్ లో మార్పులు చేసారు. దీంతో.. యుద్ధం మరింత కాలం కొనసాగితే.. వంట గ్యాస్ ఇబ్బందులు తప్పవనే ఆందోళన వ్యక్తం అవుతోంది.



